పట్టు పడితే 'పది' సాధ్యమే..!

- ప్రభుత్వ పాఠశాలల్లో ఎస్సెస్సీ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- వెనుకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధ
- వందశాతం ఫలితాలే లక్ష్యంగా కసరత్తు

కరకగూడెం: విద్యార్థి జీవితంలో పదో తరగతి ఎంతో కీలకం. ఇక్కడ మంచి మార్కులు సాధిస్తే మంచి భవిష్యత్‌కు పునాదులు వేసుకున్నట్లే. వచ్చేనెల 18 నుంచి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యాన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులపై అధికార యంత్రాంగం, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. ఉదయం, సాయంత్రం రెండు గంటల చొప్పున ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ పిల్లలను పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నారు. విద్యార్థులకు పాఠ్యాంశాలు సులువుగా అర్థమయ్యేలా అభ్యాస దీపికలను అందజేయగా, 'లక్ష్య' కార్యక్రమం అమలుతో ఉత్తమ ఫలితాలు వస్తాయని చెబుతున్నారు.

ఉత్తమ ఫలితాలే లక్ష్యం

ప్రభుత్వ పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులకు ఉత్తమ ఫలితాలు సాధించడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు తీర్చిదిద్దుతున్నారు. ముఖ్యంగా విద్యార్థులకు అభ్యాస దీపికల్లో లఘు, వ్యాసరూప, బహుళ, ఐచ్ఛిక ప్రశ్నలను జవాబులతో ఇవ్వగా.. వార్షిక పరీక్షల్లో ఎలాంటి ప్రశ్నలు వస్తాయి, సమాధానాలు ఎలా రాయాలో వివరించారు. ఇక పలు చోట్ల ఉపాధ్యాయులు వారి పరిధిలోని విద్యార్థులకు ప్రతిరోజు ఉదయాన్నే ×వేకప్ కాల్స్‌ˇ చేస్తున్నారు. కొందరు చొప్పున విద్యార్థులను ఎంచుకున్న ఉపాధ్యాయులు వారి తల్లిదండ్రులకు తెల్లవారుజామున 5 గంటలకు ఫోన్ చేసి నిద్ర లేచారా, లేదా అని ఆరా తీస్తున్నారు. బాగా చదివించాలని సూచిస్తుండటంతో ఉత్తమ ఫలితాలు వచ్చే అవకాశముందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కాగా, ఎస్సెస్సీ విద్యార్థులకు ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తుండగా ప్రభుత్వమే అల్పాహారం అందజేయాలన్న వినతులు వెల్లువెత్తాయి. ఇంతలోనే ప్రతీ విద్యార్థికి రోజుకు రూ.5 చొప్పున కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది. అయితే, గతేడాది రూ.10 కేటాయించగా ఈసారి తగ్గించడంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది.



కరకగూడెం జెడ్పీ పాఠశాలలో ప్రత్యేక తరగతులను పర్యవేక్షిస్తున్న ఉపాధ్యాయులు



సందేహాలు నివృత్తి చేస్తున్న ఉపాధ్యాయుడు

పరీక్షలకు సిద్ధం చేస్తున్నాం..



వార్షిక పరీక్షలు సమీపిస్తుండడంతో ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకునేలా విద్యార్థులకు సూచనలు చేస్తున్నాం. వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులంతా శ్రమిస్తున్నారు. తల్లిదండ్రులు కూడా పిల్లలను ప్రతిరోజూ బడికి పంపడమే కాక ఇంటి వద్ద కూడా చదివించాలి.

–జి.మంజుల, హెచ్‌ఎం, కరకగూడెం జెడ్పీహెచ్‌ఎస్

సులువుగా అర్థమవుతున్నాయి



అభ్యాసదీపికలు చదివితే పాఠ్యాంశాలు సులువుగా అర్థమవుతున్నాయి. ముఖ్యమైన అంశాలను దీపికల్లో పొందుపరిచారు. దీంతో ఉత్తమ ఫలితాలు సాధిస్తామనే నమ్మకం ఏర్పడింది. వీటికి తోడు ప్రత్యేక తరగతులకు హాజరవుతుండటంతో పరీక్షలపై భయం పోతోంది.

–జి.ఉదయశ్రీ మానస, కరకగూడెం జెడ్పీ పాఠశాల

పది జీపీఏస్సే లక్ష్యం..



పదో తరగతి వార్షిక పరీక్షలో పది పాయింట్లే లక్ష్యంగా చదువుతున్నా. ఎప్పటికప్పుడు సందేహాలను నివృత్తి చేసుకుంటూ పరీక్షలకు సిద్ధమవుతున్నాం. కష్టమైన సబ్జెక్టులకు ఎక్కువ సమయం కేటాయించి సాధన చేస్తున్నా. ఉపాధ్యాయులు అర్థమయ్యేలా బోధిస్తున్నారు.

–శివరాత్రి నాగేశ్వరి, భట్టుపల్లి జెడ్పీ పాఠశాల

ఎక్కువ సమయం కేటాయిస్తున్నాం



పరీక్షలు దగ్గర పడుతుండడంతో పాఠ్యాంశాల వారీగా చదువుతున్నాం. ప్రత్యేక తరగతుల్లో ఉపాధ్యాయులు ముఖ్యమైన అంశాలు బోధిస్తున్నారు. గణితం, సైన్స్‌కు ఎక్కువ సమయం కేటాయిస్తున్నా. ఉపాధ్యాయుల సూచనలతో పది జీపీఏ సాధిస్తాననే నమ్మకముంది.

–వై.రతీశ్, అనంతారం జెడ్పీ పాఠశాల

క్లుప్తంగా

పర్యావరణాన్ని పరిరక్షించాలి



మాట్లాడుతున్న వైవీ గణేశ్

చర్ల: పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతీ ఒక్కరూ పాటు పడాలని హనుమకొండ జిల్లా రెవెన్యూ అధికారి వైవీ గణేశ్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక బస్టాండ్ ఆవరణలో పర్యావరణ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కాగా, చర్లలో పనిచేసిన కాలంలో వైవీ గణేశ్ నాటిన మొక్కలు ప్రస్తుతం వృక్షాలుగా మారగా వాటిని చూసి సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం గణేశ్ దంపతులను సన్మానించారు. పర్యావరణ పరిరక్షణ కమిటీ చైర్మన్ ఆంజనేయరాజు, కార్యదర్శి చీమలమర్రి మురళీకృష్ణ, కమిటీ సభ్యులు కొత్తపల్లి ఆంజనేయులు, నీలి ప్రకాశ్, విస్సా నాగభూషణం, పీవీ రమణ, దొడ్డి తాతారావు, ముమ్మనేని అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా శ్రీ బాలాజీ కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

అన్నపురెడ్డిపల్లి : మండల కేంద్రంలో కొలువుదీరిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి వారి కల్యాణాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. స్వామివారికి ఉదయం పంచామృతాభిషేకం, అర్చన, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు ప్రసాదాచార్యులు స్వామివారి కల్యాణ వేడుకను వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం అందజేశారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

దమ్మపేట: మండలంలోని చిల్లగుంపు గ్రామంలో ఉన్న శ్రీకోదండరామాలయ తొలి వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరాముడికి అర్చన, అభిషేకాలు నిర్వహించారు. గ్రామస్తులు భారీగా ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, సొసైటీ డైరెక్టర్ ఎల్లిన రాఘవరావు, కొయ్యల అచ్యుతరావు, కొర్సా సాగర్, కాసాని నాగప్రసాద్, ఎర్రా వసంతరావు, మన్నెం అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీ భర్తకు పరామర్శ

కరకగూడెం: ఎంపీపీ రేగా కాళిక భర్త రేగా సత్యనారాయణ ఇటీవల గుండె సంబంధిత ఆపరేషన్ చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు, రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర శనివారం రాత్రి కుర్నవల్లిలోని ఆయన నివాసంలో పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట రేగా కాంతారావు ఉన్నారు.

చట్టాలపై అవగాహన

భద్రాచలం: భద్రాచలం జైలులోని బాల ఖైదీలకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి చట్టాలపై శనివారం అవగాహన కల్పించారు. బాల నేరస్తులను గుర్తించి, అవసరమైన సాయం అందించడంలో భాగంగా ఆమె భద్రాచలం సబ్‌జైలును సందర్శించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై మాట్లాడగా... జైలు సూపరింటెండెంట్ ఉపేందర్‌తో పాటు పి.నిరంజన్‌రావు, బాసం శారద, పేరాల వెంకటేశ్వర్లు, తిరుమల్‌రావు, పేరాల నాగరాజు, రమణ, టి.లలిత పాల్గొన్నారు.

భూవివాదంపై కేసు

దమ్మపేట: వ్యవసాయ క్షేత్రంలోకి అక్రమంగా ప్రవేశించి, అసభ్య పదజాలంతో దూషించిన వ్యక్తులపై శనివారం పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని గండుగులపల్లికి చెందిన బొంత కుమార్ శుక్రవారం తన పొలంలో మామిడి చెట్లను నరికిస్తున్నాడు. ఇంతలోనే ఇంటుక చిన్న వెంకటేశ్, ఇంటుక చిన్ననాగులు చేరుకుని అడ్డుకోగా, ప్రశ్నించిన కుమార్‌ను అసభ్య పదజాలంతో దూషించి దాడి చేశారు. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సాయికిశోర్‌రెడ్డి తెలిపారు.

పంట దున్నిన వ్యక్తిపై..

వేరుశనగ పంటను ట్రాక్టర్‌తో దున్ని నాశనం చేసిన వ్యక్తులపై కేసు నమోదైంది. మండలంలోని మందలపల్లికి చెందిన వేమవరపు భద్రయ్య అఖినేపల్లిలోని తన పొలంలో వేరుశనగ పంటను సాగు చేస్తున్నాడు. ఈ క్రమంలో మందలపల్లికి చెందిన ఎర్రపాటి ఏకాంబరేశ్వరరావు శుక్రవారం ట్రాక్టర్‌తో దున్నించి పంటను నాశనం చేశాడు. దీంతో భద్రయ్య ఫిర్యాదు మేరకు పోలీసుల కేసు నమోదు చేశారు.

లైగింక వేధింపులపై కేసు

అశ్వారావుపేటరూరల్: వివాహితను వేధింపులకు గురి చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అదనపు ఎస్‌ఐ శివరామకృష్ణ కథనం ప్రకారం.. మండలంలోని వేదాంతపురం గ్రామానికి చెందిన ఓ వివాహిత గత నెల 29వ తేదీన ఇంట్లో నిద్రిస్తుండగా, అదే గ్రామానికి చెందిన జి.వెంకటేశ్వరరావు లైగింక వేధింపులకు పాల్పడ్డాడు. ఆమె కేకలు వేయటంతో పారిపోయాడు. దీనిపై శనివారం బాధితురాలు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

దాడి చేసిన వ్యక్తిపై..

దాడికి పాల్పడిన వ్యక్తిపై స్థానిక పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. అదనపు ఎస్‌ఐ శివరామకృష్ణ కథనం ప్రకారం.. మండలంలోని గుమ్మడవల్లి గ్రామానికి చెందిన డేరంగుల వెంకన్న, ఇదే గ్రామానికి చెందిన బత్తుల రామకృష్ణ మధ్య రోడ్డు విషయంలో వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో వెంకన్నపై రామకృష్ణ దాడికి పాల్పడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

బూర్గంపాడు: గోదావరి నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను శనివారం తెల్లవారుజామున పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ రాజ్‌కుమార్ కథనం ప్రకారం.. సారపాక సమీపంలోని గోదావరి నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించామని, తరలిస్తున్నవారిపై కేసులు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

మృతికి సంతాపం



అబ్రహాం (ఫైల్)

చండ్రుగొండ: మండలంలోని యూపీఎస్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు అబ్రహాం (56) అనారోగ్యంతో శనివారం మృతి చెందగా తోటి ఉపాధ్యాయులు, గ్రామస్తులు సంతాపం తెలిపారు. మృతుడిది ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం గ్రామం.

ఎంపీ సీటు ఆదివాసీలకు కేటాయించాలి



మాట్లాడుతున్న దాట్ల నాగేశ్వరరావు

చర్ల: మహబూబాబాద్ పార్లమెంట్ సీటును ఆదివాసీలకే కేటాయించాలని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ దాట్ల నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని ఎదిరగుట్టల వద్ద గల సమ్మక్క, సారలమ్మ దేవాలయ ప్రాంగణంలో ఆదివాసీల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించగా ఆయన పాల్గొని మాట్లాడారు. ఆదివాసీలు సంస్కృతి, సంప్రదాయాలతో పాటు కళలను రక్షించుకోవాలన్నారు. ఆదివాసీలకు దక్కాల్సిన రాజకీయ రిజర్వేషన్ల పరంగా మహబూబాబాద్ పార్లమెంట్ స్థానం విషయంలో ఆదివాసీలకు 2009, 2014, 2019లో తీవ్ర అన్యాయం జరిగిందని, ఆ పార్లమెంట్ స్థానంలో ఆదివాసీలు అధికంగా ఉన్నప్పటికీ ఆ సీటును లంబాడాలకు కేటాయిస్తూ రాజకీయ పార్టీలు అవమానిస్తున్నాయని ఆరోపించారు. ఈసారైనా ఆ సీటును ఆదివాసీలకే కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర జేఏసీ కన్వీనర్ ఈసం సుధాకర్, ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుబ్బకట్ల సుమన్, ఆదివాసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ వాసం రామకృష్ణదొర, రాష్ట్ర సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు ఉయికా శంకర్, తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆలెం కోటి, ఆదివాసీ హక్కుల పరిరక్షణ వేదిక రాష్ట్ర కన్వీనర్ ఇర్పా రాజు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రింటర్ వితరణ



ప్రింటర్ అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

అశ్వాపురం: అశ్వాపురం జెడ్పీహెచ్‌ఎస్‌కు పూర్వ విద్యార్థి నల్లపాటి నాగేశ్వరరావు.. తన తండ్రి వెంకటనర్సయ్య జ్ఞాపకార్థం ప్రింటర్ అందజేశారు. ఈ మేరకు రూ.20 వేల విలువైన ప్రింటర్‌ను శనివారం అందజేయగా హెచ్‌ఎం యోగితావేణి, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. పూర్వ విద్యార్థులు కొర్లకుంట శ్రీనివాసరావు, అంజన్‌రావు, గాదె కేశవరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ల సమావేశం



సమావేశంలో పాల్గొన్న ఎలక్ట్రీషియన్లు

దుమ్ముగూడెం: మండలంలోని ములకపాడు గ్రామంలో మండల ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ల కార్యవర్గ బాధ్యులు శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు రాయపూడి సూరిబాబు మాట్లాడుతూ.. సంఘాన్ని బలోపేతం చేసేలా ప్రతీ ఎలక్ట్రీషియన్ సభ్యత్వం తీసుకోవాలని కోరారు. సమావేశంలో రాజు, వందవాసు రాము, ముక్కెర రాంబాబు, నెట్ల అబ్బులు, సాగర్, కరుణాకర్, ప్రభాకర్, పృథ్వీ, రామకృష్ణ, భద్రం, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నిస్తే కేసులు పెడతారా?



మాట్లాడుతున్న బొర్రా విజయ్

చండ్రుగొండ: కొత్తగూడెం డీఎంహెచ్‌ఓపై వచ్చిన అవినీతి ఆరోపణలను ప్రశ్నించిన ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్‌నాయక్‌పై పోలీసులు కేసు నమోదు చేయడం హేయమైన చర్య అని జై ఆదివాసీ యువశక్తి జిల్లా అధ్యక్షుడు బొర్రా సురేశ్ అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంఘాల నాయకులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏదైనా అంశంపై ప్రశ్నిస్తే కేసులు పెడతారా? అని నిలదీశారు. రాజేశ్‌నాయక్‌పై పోలీసులు పెట్టిన కేసు ఎత్తివేయాలని, లేనిపక్షంలో కలెక్టరేట్ ముట్టడి చేపడుతామని పేర్కొన్నారు. సమావేశంలో గుగులోతు మోహన్‌నాయక్, ఎండీ ఫజల్‌బీ, రంగానాయక్, రాందాస్‌నాయక్, కృష్ణ, ఓర్సు రామకృష్ణ, గద్దల విజయ్, బానోత్ సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రద్ధగా చదివితే ఉత్తమ ఫలితాలు



అన్నపురెడ్డిపల్లి: మాట్లాడుతున్న కందాల రామయ్య



ములకలపల్లి: స్టడీ మెటీరియల్ అందిస్తున్న దృశ్యం

అన్నపురెడ్డిపల్లి: పదో తరగతి వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులు శ్రద్ధగా చదవాలని, తద్వారా ఉత్తమ ఫలితాలు సాధించాలని జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కందాల రామయ్య సూచించారు. మండలంలోని ఎర్రగుంట జెడ్పీ పాఠశాల పదో తరగతి విద్యార్థులకు శనివారం పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రామయ్య మాట్లాడుతూ సమయాన్ని సద్వినియోగం చేసుకోవడం ఎలాగో వివరించారు. సమావేశంలో హెచ్‌ఎం ఆనంద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదవాలి

ములకలపల్లి: ఇష్టపడి చదివినప్పుడే చక్కటి ఫలితాలు వస్తాయని ఎంపీటీసీ శనగపాటి మెహరమణి అన్నారు. కస్తూరి ఫౌండేషన్ సహకారంతో ములకలపల్లికి చెందిన పుష్పాల చందర్‌రావు ఆధ్వర్యంలో పొగళ్లపల్లి, స్థానిక హైస్కూల్ పదో తరగతి విద్యార్థులకు స్టడీమెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడారు. మండలవాసి, కారేపల్లి ఎస్‌ఐ పుష్పాల రామారావు చొరవతో రెండేళ్లుగా కస్తూరి ఫౌండేషన్ ఫౌండర్ చరణ్ స్టడీమెటీరియల్ అందించడం అభినందనీయమన్నారు. హెచ్‌ఎం లత, పుష్పాల వెంకన్న, బండి కొమరయ్య, శనగపాటి సీతారాములు, పుష్పాల సాయి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సర్పంచ్, ఉపసర్పంచ్‌కు సన్మానం



జ్ఞాపిక అందజేస్తున్న గ్రామస్తులు



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

అశ్వాపురం: మండలంలోని మొండికుంట సర్పంచ్ మర్రి మల్లారెడ్డి, ఉపసర్పంచ్ మేడవరపు సుధీర్‌ను.. పదవి విరమణ సందర్భంగా శనివారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో రాయల్స్ ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా వారికి జ్ఞాపికలు అందించారు. సమావేశంలో గ్రామస్తులు మాట్లాడుతూ వారి సేవలను కొనియాడారు. అనంతరం మొండికుంట రెడ్డి సంఘం ఆధ్వర్యంలో సర్పంచ్ మర్రి మల్లారెడ్డిని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు.

పాఠశాలలో సరస్వతి విగ్రహం ఏర్పాటు

మండలంలోని మొండికుంట గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో పదవీ విరమణ పొందిన సర్పంచ్ మర్రి మల్లారెడ్డి ఆధ్వర్యంలో దాతలు భీముడి భాస్కర్‌రెడ్డి, కుటుంబ సభ్యులు సరస్వతి విగ్రహం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భీముడి నారాయణరెడ్డి కుటుంబ సభ్యులకు మర్రి మల్లారెడ్డి, పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

పరిసరాలు, వ్యక్తిగత శుభ్రతతో ఆరోగ్యం



మణుగూరురూరల్: పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం



దుమ్ముగూడెం: స్థానికులను పరీక్షిస్తున్న వైద్యుడు

మణుగూరురూరల్: ప్రతీఒక్కరు వ్యక్తిగతంగానే కాకుండా పరిసరాల పరిశుభ్రత పాటిస్తేనే ఆరోగ్యం దరిచేరుతుందని మణుగూరు పీహెచ్‌సీ వైద్యాధికారి శివకుమార్ సూచించారు. మండలంలోని పెద్దిపల్లిలో శనివారం నిర్వహించిన వైద్యశిబిరంలో ఆయన స్థానికులకు పరీక్షలు చేశాక మాట్లాడారు. ఉద్యోగులు రాంప్రసాద్, శైలజ, రవి, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం మండలంలో..

దుమ్ముగూడెం: పర్ణశాల పీహెచ్‌సీ పరిధి పర్ణశాల, గౌరారం, ములకనాపల్లి, పైడిగూడెంలలో డాక్టర్ రేణుకారెడ్డి ఆధ్వర్యాన హెల్త్‌క్యాంపులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటి సర్వే చేసి 69 మందికి రక్తపరీక్షలు చేశారు. అనంతరం పలు గ్రామాల్లో కుష్ఠు వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. నాగేశ్వరరావు, అనసూర్య, సావిత్రి, నర్సమ్మ పాల్గొన్నారు.

వీహెచ్‌పీ ప్రఖండ ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్

ములకలపల్లి: విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) ములకలపల్లి ప్రఖండ ఉపాధ్యక్షుడిగా పువ్వాల శ్రీనివాస్ నియమితులయ్యారు. మండల కేంద్రంలో శనివారం జరిగిన సమావేశంలో వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి నాగేశ్వరరావు, ఖమ్మం విభాగ్ సంఘటన కార్యదర్శి గడదేసి వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి గంగాధర సీత, భజరంగ్‌దళ్ జిల్లా సంయోజక్ మెరుగు వెంకటేశ్వరరావు పాల్గొని శ్రీనివాస్‌కు నియామకపత్రం అందించారు. వీహెచ్‌పీ మండల అధ్యక్షుడు డాక్టర్ కారంపూడి సత్యనారాయణరాజు, కార్యదర్శి గొర్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

బీటీపీఎస్ సీఈకి సమ్మె నోటీస్ అందజేత



సమ్మె నోటీస్ అందజేస్తున్న దృశ్యం

మణుగూరురూరల్: కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 16న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు సత్రపల్లి సాంబశివరావు పిలుపునిచ్చారు. శనివారం బీటీపీఎస్ సీఈ బిచ్చన్నకు సీఐటీయూ ఆధ్వర్యంలో సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్‌ల అమలును ఉపసంహరించుకోవాలని, కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలనే తదితర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు దడిగల సత్యనారాయణ, కృష్ణ, రవి, రమణ, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే సర్వీసులను పునరుద్ధరించాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మణుగూరురూరల్: మణుగూరు నుంచి రాకపోకలు సాగించి కరోనా సమయంలో రద్దయిన మూడు రైలు సర్వీసులను తిరిగి పునరుద్ధరించేలా చొరవ చూపాలని కోరుతూ మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవితకు శనివారం బీఆర్‌ఎస్ యూత్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మణుగూరు నుంచి బెల్గావి ఎక్స్‌ప్రెస్, కాకతీయ ఫాస్ట్ ప్యాసింజర్ రైలు ప్రజలకు సౌకర్యంగా ఉండేవని, కరోనా ప్రభావంతో ఒక్కొక్కటిగా సర్వీసులు రద్దయ్యాయని తెలిపారు. రైల్వేశాఖ మంత్రితో మాట్లాడి ఆయా రైలు సర్వీసుల పునరుద్ధరణకు కృషి చేయాలని వారు ఎంపీని కోరారు. రుద్ర వెంకట్, తురక రామకోటి ఉన్నారు.

'విద్యారంగంపై సవతితల్లి ప్రేమ'

అశ్వాపురం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో విద్యారంగానికి తక్కువ నిధులు కేటాయించడం ద్వారా సవతితల్లి ప్రేమ కనబర్చారని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఈనపల్లి పవన్‌సాయి అన్నారు. అశ్వాపురంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బడ్జెట్‌లో విద్యారంగాన్ని పూర్తిగా విస్మరించారని ఆరోపించారు. పది శాతానికి బదులు 2.61 శాతమే నిధులు కేటాయించారన్నారు. సమావేశంలో నాయకులు అక్కినపల్లి నాగేంద్రబాబు, వెంకట్, రాజా, విజయ్, రాము, రఘు తదితరులు పాల్గొన్నారు.